

యుటిఎఫ్ నిరసన

నెల్లూరు :యుటిఎఫ్ చేసిన పోరాట ఫలితంగా రద్దు చేసుకున్న అప్రెంటీస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ తిరిగి తీసుకురావడం దుర్మార్గమని యుటిఎఫ్ జిల్లా నాయకులు విమర్శించారు. 2004 డిఎస్సిలో అప్రెంటీస్ విధానాన్ని తీసుకరావడాన్ని నిరసిస్తూ సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యాలయం వద్ద 2024 డిఎస్సి నోటిఫికేషన్ ప్రతు లను దగ్ధం చేసి నిరసన తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవ కోటేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్ద కాలం పైగా అనేక ఉద్యమాల చేసి ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేసుకోవడం జరిగిం దన్నారు. ప్రభుత్వం మళ్లీ ఆ అప్రెంటిస్ విధానాన్ని పునరు ద్ధరించటం దారుణ మన్నారు జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.వీ చలపతి శర్మ, జిల్లా కోశాధికారి జిల్లా కార్యదర్శులు కె.నాగిరెడ్డి, మండల నాయకులు వి.శీనయ్య, ఎస్కె. రియాజ్, పి. పెంచల నరసింహులు, నరసింహులు, కరిముల్లా ఉన్నారు.

నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

నెల్లూరు పెద్దారెడ్ల రాజకీయ ప్రకంపనలు..!

-నూతన గూటికి 'వేమిరెడ్డి'
-ఆదాల, మాగుంట నిర్ణయంపై ఉత్కంఠ
- 'పర్వతరెడ్డి' 'ఆనం'కు సిఎం పిలుపు

నెల్లూరు పెద్దారెడ్లు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నారు. ఏ పార్టీ అధికారానికి దగ్గరగా ఉంటుందో అటు వైపు వెళ్ల రాజకీయంగా మార్పులకు తెరతీస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి వైసిపికి దాదాపు దూరమైనట్లు సమాచారం. ఈ నేనథ్యంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి కీలకమైన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. బిజెపి, టిడిపి ఏదొక పార్టీలో చేరుతారని ప్రచారం సాగుతోన్న వేళ, ఆయన టిడిపి నేతలతో టచ్లోఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్లోని ఆయన టిడిపి పెద్దలను కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్రెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి నిర్ణయం పైనా ఉత్కంఠ నెలకొంది. ముగ్గురు నేతలు హైదరాబాద్లో కలిసినట్లు తెలుస్తోంది. ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి, మాజీ డిసిసిబి ఛైర్మన్ ఆనం విజయ కుమార్రెడ్డిలను ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి తాడేపల్లి పిలిచి మాట్లాడారు. ఎలాంటి పరిస్థితులుకైనా సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పినట్లు తెలిసింది.

వేమిరెడ్డిప్రభాకర్రెడ్డి, రాజ్యసభ సభ్యులు

ఆదాల ప్రభాకర్రెడ్డి, ఎంపి, నెల్లూరు

మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎంపి -ఒంగోలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. వైసిపి, టిడిపి రాజకీయ చదరంగంలో ఎవరు ఎటు వైపు ఉన్నారో అర్థం కాని పరిస్థితి నెలకొన్నాయి. అత్యంత వేగంగా జిల్లా రాజకీయాలు మారుతున్నాయి. సోమవారం అటు హైదరాబాద్, ఇటు విజయవాడలో రాజకీయ పరిణామాలు ఉత్కంఠంగా మారాయి. వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి నెల్లూరు నగర వైసిపి టికెట్ విషయంలో అలిగి ఎంపిగా పోటీ చేయడం లేదని అధిష్టానాకి తేల్చిచెప్పారు. ఇదే సమయంలో వైసిపిలో కొనసాగడంలేదని కూడా స్పష్టం చేశారు. అప్పటి నుంచి వైసిపి నేతలకు దూరంగా ఉంటున్నారు. బిజెపిలో చేరాలని తొలుత నిర్ణయం తీసుకున్న సమాచారం. అటు తరువాత టిడిపి వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. నెల్లూరు నగర లోకసభ నుంచి పోటీచేయడంతోపాటు, తన వారికి మరో ఎంఎల్ఎ టికెట్ ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఏ నాయకుడు స్పష్టం చేయకపో వడంతో అనేక సందేహాలు కొనసాగుతున్నాయి. ఆదివారం హైదరాబాద్కు వచ్చిన ఆయన ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్రెడ్డిలతో కలిసి రాజకీయ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. సోమవారం అంతా టిడిపి ముఖ్యనేతలతో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఇప్పటికే వైసిపి టికెట్ ఇవ్వనని చెప్పింది. ఆదాల ప్రభాకర్రెడ్డి తొలి నుంచి పక్కచూపులు చూస్తున్నారని ప్రచారం సాగుతోంది. తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు కొంత ఇచ్చినా ఇంకా రూ.60 కోట్లు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు విషయంలో ముఖ్య మంత్రి ఏ నిర్ణయమూ చెప్పకపోవడంతో ఆయన ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి ఇప్పటికే పార్టీ మారాలని నిర్ణయం తీసుకోగా, ఆదాల ప్రభాకర్రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. నేడో, రేపో ముగ్గురు నేతలు పార్టీ మారుతారని విశ్వసనీయ సమాచారం. ఈ ముగ్గురు నిర్ణయం జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపనుంది..

ఆనం విజయ్కుమార్రెడ్డి, వైసిపి నాయకులు

'పర్వతరెడ్డి,' 'ఆనం'లకు సిఎం పిలుపు..!

జిల్లాలో మారుతోన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అలెర్ట్ అయ్యారు. వేమిరెడ్డి, ఆదాల, మాగుంట, ఇతర నేతలు పార్టీకి దూరమైతే జిల్లాలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే విషయంలో సోమవారం ఉదయం ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్రెడ్డిలను తాడేపల్లికి పిలిపించారు. ఆఘమేఘాలపై వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు.ఆదాల ప్రభాకర్రెడ్డి పార్టీ మారుతారనే విషయం వైసిపి అధిష్టానం దృష్టిలో ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు రూరల్కు ఈ ఇద్దరు నేతల్లో ఒకరికి అవకాశం కల్పించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కొందరు నేతలు పార్టీ మారితే జరిగే పరిస్థితిని గురించి ఆరా తీసినట్లు సమాచారం. నెల్లూరు పెద్దారెడ్ల నిర్ణయంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. నేడో, రేపో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

ముఖ్యమంత్రిని జగన్మోహన్రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి

గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను

జయప్రదం చేయండి..!

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి - నెల్లూరు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతాంగ రంగాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని ఈ చర్యలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెలను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకుల విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. కేంద్రంలో బి.జె.పి. అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయాన్ని ఆధారపడి జీవిస్తున్న రైతులను పొలాల నుంచి బయటకు నెట్టేసే వ్యవసాయరంగాన్ని గుంపగుత్తగా కార్పొరేట్లకు దారాదత్తం చేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుందన్నారు. దేశంలోని కార్మికులు, ఉద్యోగుల శ్రమను కార్పొరేట్ శక్తులు దోచుకునేందుకు అవకాశం కల్పిస్తూ కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈనెల 16 న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను నిర్వహించాలని సంయుక్త కిసాన్మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చాయన్నారు. ఈ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, అన్ని పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర నిర్ణయించి అమలు చేసేందుకు పార్లమెంట్లో చట్టం చేయాలని, రైతాంగ రుణాలను రద్దు చేయాలని, కేంద్రం ప్రవేశపెట్టిన 2022 విద్యుత్ బిల్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి పంపుసెట్లకు, గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రక్రియను ఆపాలని, ఆహార భద్రత చట్టం వెంటనే అమలు చేయాలని, సాగులో ఉన్న వ్యాప్త కౌలు రైతులకి నష్టపరిహారం ఇవ్వాలని, బీమా, రుణ సౌకర్యం కల్పించాలని, ఉపాధిహామీ పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధిహామీ పథకానికి 2 లక్షల కోట్లు కేటాయించాలని, 200 పనిదినాలు కల్పించాలని, భూహక్కుల చట్టం 27/23ను ఉపసంహరించాలని, చుక్కల భూములు, పేదలు సాగుచేసుకుంటున్న అన్ని రకాల ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనదారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేస్తున్న ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీచేసే పనిని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని, డ్రైవర్లకు ఉరితాడుగా మారే మోటార్ ట్రాన్స్పోర్ట్ చట్టం 106-(1), 106-(2)లను వెంటనే ఎత్తివేయాలన్నారు. జిల్లాకు ప్రధాన నీటివనరైన సోమశిల జలాశయం అప్రాన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జరుగుతున్న ఈ గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్, జిల్లా వ్యాప్తంగా జరుగు నిరసన ప్రదర్శనల్లో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ (ఎంఎల్) జిల్లా నాయకులు లక్ష్మీరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాయకులు షేక్ మస్తాన్ బీ, జి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్వాజ్, సిపిఎం నెల్లూరు రూరల్ కమిటీ కార్యదర్శి బత్తల కృష్ణయ్య పాల్గొన్నారు

పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలింపు సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు :కృష్ణపట్నం పోర్టు నుంచి కంటైనర్ టెర్మినల్ తరలింపు విషయంలో అధికారులు జోక్యం చేసుకోని కార్మికులకు న్యాయం చేయాలని, నియమనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ సంస్థ యాజమాన్యం అదానిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల నాయకులు కలెక్టర్ ఎం. హరినారాయణన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, ఎఐఎఫ్టియుసి నాయకులు యానాదయ్య, ఐఎఫ్టియు నాయకులు సాగర్, కృష్ణపట్నం పోర్టు కార్మిక సంఘం నాయకులు గోగుల శ్రీనివాసులు, సిఐటియు నాయకులు కె.పెంచలనర్సయ్య, అల్లాడి గోపాల్లు కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో నాయకులు మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి, పోర్టు సిఇఒలు ఇద్దరూ పచ్చి అబద్దాలు చెబుతున్నారన్నారు. కంటైనర్ టెర్మినల్ తరలింపుతో రాష్ట్రానికి పన్నుల రూపేణా వచ్చే ఆదాయం నష్టపోతున్నా ముఖ్యమంత్రి పట్టిపట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. వేలాదిమంది ఉద్యోగులకు ఉపాధినిచ్చే కంటైనర్ టెర్మినల్ను మూసివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కంటైనర్ టర్మినల్ తరలించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మొండిగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల పనిచేస్తున్న 2 వేల మంది ఉద్యోగులు, దీనిని ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న 10 వేల కుటుంబాలు వీధిన పడతా యన్నారు. కంటైనర్ టర్మినల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్న వేల కుటుంబాలకు మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి, సిఇఒ ఈ వ్యవహారంపై ఖచ్చితమైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు

-తోటపల్లిగూడూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మండలంలోని వరకవిపూడి పంచాయతీ అనంతపురంలో ఆదివారం మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ డైయిరీ కార్పొరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి, ఇసనాక రమేష్ రెడ్డి, ఎంపిపీ స్వర్ణలత, గూడూరు విష్ణుమోహన్ రెడ్డి, జెడ్పిటిసి శేషమ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, పద్మనాభ రెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, చిరంజీవి గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు జాన్ సాహెబ్ మృతి

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని శామీరపాలెం గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు జాన్ సాహెబ్ సోమవారం మృతిచెందారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు జాన్ సాహెబ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిం చారు. జాన్ సాహెబ్ మృతిపై విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించినవారిలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు ఉన్నారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం

పొదలకూరు :జాగ్రత్తగా లేకుంటే జేబుకు చిల్లి పడుతుందని, గ్రామీణులు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగి ఉండాలని ట్రీస్ సేవా సంస్థ ప్రెసిడెంట్ షేక్.నౌరాజ్ కోరారు.మండలంలోని అమ్మవారిపాలెం ఎస్సీ కాలనీలో ఆర్బిఐ వారి సౌజన్యంతో పొదలకూరుకు చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత- సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవల పై అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన గోడ పత్రికలు చూపరులను ఆకొట్టుకున్నాయి. తాటిపర్తి(జీసీ) స్కూల్ ఉపాధ్యాయని జ్యోతి సుబ్బారావు ఆధ్వ ర్యంలో చిన్నారుల నత్య ప్రదర్శన ఖాతా దారులను ఆకట్టుకుంది. అమ్మవారి ప్రాథమిక పాఠశాల హెచ్.ఎం సురేష్, ప్రభగిరిపట్నం హెచ్ఎం వెంకటరత్నం నాయుడు పొదుపు అవసరం , సైబర్ నేరాలపై వివరించారు. ఖాదర్ భాషా, అమ్మవారి పాలెం జెడ్పి స్కూల్ పీ.డీ సురేంద్రబాబు ట్రీస్ సేవా సంస్థ, కార్యదర్శి అహ్మద్ మాట్లా డారు. బ్యాంకింగ్ అంబుడ్స్మెన్నుఉపయోగించుకోవాలని సూచించారు. హైదరా బాదు ఆర్బిఐ మేనేజర్ ఓంకార్, ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ గయాజ్ ఉన్నారు.

'స్పందన'లో 10 అర్జీలు

కందుకూరు :కందుకూరు పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా 10 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి.క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్య క్రమంలో అందరు సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘం కార్యాలయము కమిషనర్ వారి ఛాంబర్లో జరిగే స్పందన ,డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ కె. వి. క్రిష్ణారెడ్డి తెలిపారు.

దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు అర్బన్ : 10వ డివిజన్ జనసేన ఇన్ఛార్జి, ముదిరాజ్ మహాసభ జిల్లా యువత అధ్యక్షుడు శ్రీనివాసులు ఇంటిపై ఈ నెల 9వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారని సోమవారం ఎస్పికి ఫిర్యాదు చేశారు. కొత్త నెంబర్ నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయని, ఆ తర్వాత తెల్లవారుజామున తన ఇంటి పై పెద్ద పెద్ద రాళ్లతో దాడి చేశారని, కరెంటు మీటర్లు లింకులు తీసేసి ఇంటి తలుపులు పగలగొట్టి దాడి చేయాలని చూశారని ఫిర్యాదు చేశారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి -నెల్లూరు

జగనన్నకి చెబుదాం (స్పందన) అర్జీలకు సత్వరపరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఆయన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిం చారు. కలెక్టర్తోపాటు ఇన్ఛార్జి డి ఆర్ ఒ బాపురెడ్డి, డి ఆర్ డి ఎ పీడీ సాంబ శివా రెడ్డి, డిపిఒ సుస్మిత ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యలపై ప్రత్యేక దష్టి పెట్టి త్వరగా పరి ష్కరించాలన్నారు. డిఆర్డిఏ పిడి సాంబశివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, నుడా విసి బాపిరెడ్డి, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ కన్నమ నాయుడు, గహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఇరిగే షన్ శాఖ ఎస్.ఇ కష్ణ మోహన్, ఐ.సి.డి. ఎస్.ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతలు స్వీకరిస్తున్న ఎస్పి తిరుమలేశ్వరరెడ్డి

ఎస్పి కార్యాలయంలో...

ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమంలో బాధితుల నుంచి 115 ఫిర్యాదులు అందుకున్నామని ఎస్పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ'స్పందన' కార్యక్రమంలో బాధితుల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల్లో అధికంగా ఉద్యోగాలు, భర్త/ అత్తారింటి వేధింపులు, దొంగతనం, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, బ్యాంక్ నందు లోన్స్, సైబర్, అధిక వడ్డీలు, అనధికార చీటీలు, ఉద్యో గాలు, కుటుంబ కలహాలు, వద్ద తల్లిదండ్రులు వేధింపులు, నమోదైన కేసులలో పురోగతి, ఇతర వివాదాలు సమస్యల ఫిర్యాదు స్వీకరించామన్నారు.

'104' వైద్య సేవలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : వైద్యాధికారుల నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 104 వాహన వైద్య సేవల క్యాంప్లపట్ల కొందరు వైద్యాధికారుల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సోమవారం మండలంలోని కొండస ముద్రం గ్రామంలో చేపట్టిన 104 వైద్య సేవల మెడికల్ క్యాంపు దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. ఉదయం 9 గంటలకు 104 సేవల మెడికల్ క్యాంపు గ్రామంలో ప్రారంభమైంది. మధ్యాహ్నం 12.00 గంటల వరకు కూడా క్యాంపుకు కేటాయించిన సదరు వైద్యాధికారి హాజరుకాలేదు. ప్రస్తుతం గ్రామాల్లో ముమ్మరంగా పనులు జరుగుతున్న క్రమంలో ఉదయం 9:30 గంటలకే ప్రజలు మెడికల్ క్యాంపు వద్దకు అధిక సంఖ్యలో చేరుకున్నారు. 104 వాహన మెడికల్ క్యాంపులో భాగంగా సాధారణంగా హిమోగ్లోబిన్, షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తారు. అయితే ఈ క్యాంపు వద్ద వైద్యాధికారి లేకపోవడంతో అక్కడ ఉన్న ఆరోగ్య సహాయకులే వచ్చిన ప్రజలకు కేవలం బిపి పరీక్షలు చేసి మాత్రలు అందజేసి పంపించడం గమనార్హం. మెడికల్ క్యాంపు వద్దకు వచ్చిన ప్రజలు వైద్యాధికారి లేకపోవడంతో సాధారణ పరీక్షలతోనే సరి పెట్టుకోవాల్సి వచ్చింది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి 104 వాహన వైద్య సేవలను గ్రామీణ ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు. సదరు వైద్యాధికారి ఈకే మణిదీపిక ను ప్రజాశక్తి వివరణ కోరగా ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ ప్రక్రియను పరిశీలించాల్సి రావడంతో క్యాంపుకు ఆలస్యమైందని తెలిపారు.

ఆరోగ్య సహాయకులే పరీక్షలు చేస్తున్న దృశ్యం

టిడిపిలో చేరిన వైసిపి కార్పొరేటర్

నెల్లూరు సిటీ : హైదరాబాదులోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు ఏడో డివిజన్ వైసిపి కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, వారి మిత్ర బందం టిడిపి తీర్థం పుచ్చు కున్నారు. పార్టీలో చేరిన వారికి చంద్రబాబు నాయుడు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరులో సమిష్టిగా టిడిపి నేతలు కార్యకర్తలు పని చేసి రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాలు సాధించాలన్నారు పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని చంద్రబాబు నాయుడు తెలిపారు. క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పొం గూరు నారాయణను అభినందించారు. 7వ విజన్ వైసీపీ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి చేరికతో నెల్లూరులో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది.



బాబు సమక్షంలో టిడిపిలో చేరుతున్న కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి

విరాళం అందజేత

కందుకూరు : అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ఎంఎల్ఏ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 6 కోట్ల రూపాయలతో మొదటి దశ నిర్మాణం పూర్తయింది.4 కోట్ల రూపా యలతో నిర్మించే అనివేటి మండప నిర్మాణానికి సోమవారం కీర్తిశేషులు గాలి కామేశ్వరరావు జ్ఞాపకార్థం వారి భార్య ఇందిరాదేవి, కుమారులు గాలి వెంకట రామకష్ణ, భార్య సుగుణ,వెంకటరమణ కుమార్, ధర్మపత్ని శారదాదేవి, రూ 50,001లు విరాళం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు మురళీ మోహన్ కు అందజేశారు.

డార్విన్ పరిణామ సిద్ధాంతంపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ : జనవిజ్ఞానవేదిక, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన జెఎస్ విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ డార్విన్ పరిణామ సిద్ధాంత దినోత్సవ సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈసదస్సు డాక్టర్ శ్రీను నాయక్ ఆధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ కాలేషా బాషా(ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్) ఎం.వి. చలపతి, (ప్రధాన ఉపాధ్యాయులు) పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ ద్వారా అవగాహన కలిగించారు. సమస్త జీవరాసులను ఎవరు సష్టించలేదు, పరిణామం ద్వార అభివద్ధి జరిగాయని డార్విన్ సిద్ధాంతాన్ని వివరించారు. నూతన విద్య విధానం పేరుతో ప్రభుత్వాలు విద్యార్థుల పాఠ్యాంశాల నుంచి డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలిగించి, విద్యార్థులను మానసి కంగా పరోక్షంగా సష్టివాదం వైపు మళ్లించే ప్రయత్నం జరుగు తుందని తెలిపారు. విద్యార్థుల్లో, ప్రజల్లో సష్టివాద భ్రమల్ని తొలిగించి, పరిణా మవాద సిద్ధాంతాన్ని విస్తతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా కార్యదర్శి ఏ.హరిబాబు, గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.డి రఫి, నగేష్, జెవివి నగర అధ్యక్ష విజయ్ కుమార్, మురళి, రవీంద్ర పాల్గొన్నారు.



పేదలకు అండగా సిపిఎం పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు : పేదలకు అండగా సిపిఎం అనేక పోరాటాలు చేసిందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్ అగర్వాల్ సెంటర్లో సిపిఎం జెండా ఆవిష్కరణ జరిగింది. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య జెండా ఆవిష్కరించారు. సిఐటియు జండాను సిఐటియు రూరల్ కార్యదర్శి కామ్రేడ్ కిన్నెర కుమార్ జండా ఆవిష్కరిం చారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. 36 డివిజన్ లో మున్సిపల్ కార్మికులు ,భవన నిర్మాణ కార్మికులు అధికంగా నివాసం ఉంటున్నారన్నారు. అనేకమంది పేదలు నివసిస్తున్నటువంటి ఈ ప్రాంతంలో గత 35 ఏళ్లకుపైగా పేదలకు అండగా ఉంటూ సిపిఎం పోరాడుతుందన్నారు. సిపిఎం చేసే అన్ని పోరాటాలను ఈ ప్రాంత ప్రజలు బలపరచాలని పిలుపు నిచ్చారు. సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్ , సీనియర్ నాయకులు జి శంకరయ్య పాల్గొని ప్రసంగించారు. రూరల్ కమిటీ సభ్యులు నందిపాటి మాలకొండయ్య ఎస్కే శంషాద్ ఎస్ బాబు,శాఖ కార్యదర్శిలు ఆర్ వి రావు,జయ ప్రకాష్, వై ఈశ్వరయ్య, కే కష్ణమూర్తి, సీనియర్ నాయకులు జి శంకరయ్య, శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ నాయకులు సుజాతమ్మ నరసింహులు ఉన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు

డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు

నెల్లూరు సిటీ : ప్రతి ఒక్క డ్రైవర్ కంటి పరీక్షల తోపాటు వైద్య సేవలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలని ఉప రవాణా కమిషనర్ చందర్ పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఉపరవాణా కమిషనర్ వారి కార్యాలయంలో మెడికల్ క్యాంపును ఎనెల్ హాస్పిటల్ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ తో కలిసి ఆయన ప్రారంభించారు. జనరల్ చెకప్ లో భాగంగా బిపి షుగర్, హిమోగ్లోబిన్ మరియు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. దాదాపుగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఉప రవాణా కమిషనర్ చందర్, ఎనెల్ హాస్పిటల్ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తాము ముందుంటామని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు అరుణ, సుమయ, ఎనల్ హాస్పిటల్ వైద్యులు హరికష్ణ, దావూద్ ఉన్నారు.

మానసిక రుగ్మతల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్ : నెల్లూరు కష్ణ చేతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులు - మానసిక రుగ్మతలు అనే అంశంపై క్లినికల్ సైకాలజిస్ట్ (ఆస్ట్రేలియా) డాక్టర్ హమీద్ అవగాహన కల్పించారు. విద్యార్థులు సమయ పాలన, చదువు రెండిటిని సమన్వయం చేసు కోవాలని సూచిం చారు. మానసిక రుగ్మతలను ముందుగానే గుర్తించడం ఎలా అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివ రించారు. మానసిక రుగ్మతలు ఉననవారు డాక్టర్ను సంప్రదించి సకాలంలో చికిత్స తీసు కోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. పలు సందేశాలను నివృత్తి చేశారు.

అక్రమ మైనింగ్పై ఫిర్యాదు

పొదలకూరు :మండలంలోని మొగళ్లూరులోని అటవీ భూమిలో అక్రమ మైనింగ్ నిర్వహి స్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని టిడిపి అనుబంధ రైతు సంఘం నాయకులు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, మండల,తెలుగు యువత అధ్యక్షులు తలచీరు. మస్తాన్ బాబు,వెన్నెపూస.రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన 'స్పందన'లో కలెక్టర్ హరి నారాయణకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మొగళ్లూరు రెవిన్యూ గ్రామంలోని సర్వేనెం. 325, 286 రీసర్వే ఎల్.పి.ఎం నెం. 685లో సుమారుగా 1000 ఎకరాల్లోని అటవీభూమిలో సుమారుగా గత 15 రోజుల నుంచి అక్రమ మైనింగ్ చేపట్టారు. గ్రామస్తుల ప్రమేయం లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి దక్షిణంవైపు, ఊచపల్లి రోడ్డుకు పడమరవైపున తెల్లరాయిని గుర్తించిన మాఫియా ఒక 200ప్రొక్లేన్, 12 టైర్లు కల్గిన రెండు టిప్పర్లు, ఒక జెసిబితో రంధ్రాలు వేస్తూ 24 గంటలు యంత్రాలతో పనులు చేస్తున్నారని తెలిపారు.ఈ అక్రమ మైనింగ్పై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దశరథరామి రెడ్డి,చిన్న ఓబుల్ ,కుమార్ ఉన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-సీతారామపురం

సీతారామపురం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయ ఆవరణంలో ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షుడు భోగ్యం శ్రీనివాసులు మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం రద్దయిన అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ ప్రవేశ పెడుతూ ఇటీవల డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని అలాగే మెగా డిఎస్‌సి అని ఊదరగొట్టిన ప్రభుత్వం స్కూల్ మర్జింగ్ జిఒ నెంబర్ 117ను రద్దు చేస్తే మెగా డిఎస్‌సిని నిర్వహించడం సాధ్యమవుతుంద న్నారు. అదేవిధంగా గత 5 సంవత్సరాలుగా డిఎస్‌సి నిర్వహించకపోవడం వల్ల అభ్యర్థుల వయోపరిమితి మరో ఐదేళ్ల పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గుడ్లవీటి వెంకటేశ్వర్లు, సహాయ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, సీనియర్ నాయకులు ఏవి. రమణయ్య, శంకర్ రెడ్డి, మహేష్, డి.వెంకటేశ్వర్లు, కె.రాజు, పవిత్ర కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురంలో డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులు దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి : యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉదయగిరి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులు దగ్ధం చేసే కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ మండల నాయకులు ఎడమ తిరుపతయ్య మాట్లాడుతూ 12యేళ్ల క్రితం రద్దైన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెడుతూ ఇవాళ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని, అలాగే మెగా డిఎస్‌సి అని ఓదరగొట్టిన ప్రభుత్వం దగా డిఎస్‌సిని విడుదల చేసిందన్నారు. స్కూల్ మిర్జింగ్ జిఒ 117ను రద్దు చేస్తే మెగా డిఎస్‌సి నిర్వహించడం సాధ్యమైయ్యేదని తెలిపారు. అలాగే గత 5 సంవత్సరాలుగా డిఎస్‌సి నిర్వహించనందున నిరుద్యోగులకు వయోపరిమితి ఇంకొక ఐదు సంవత్సరాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు హనీ, ప్రధాన కార్యదర్శి ఫణి రాజు, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, రామకృష్ణ, వెంకట్ రెడ్డి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో సమాచార చట్టం పనిచేయదా..?

మున్సిపల్ ఎదుట వైసిపి రెబల్ కౌన్సిలర్ 'సూరా' వినూత్న నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజాధనం వినియోగంపై వివరాలు అడిగితే తగిన సమాధానం ఇవ్వలేదని, ఆత్మకూరులో సమాచార చట్టం పనిచేయదా అని 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముఖద్వారం వద్ద అడ్డంగా నేలపై పడుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019-2020 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు జమఖర్చులు, మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం గురించి, మున్సిపల్ సమావేశంలో ఏ నిర్ణయాలు తీసుకున్నారో వివరాలు తెలపాలన్నారు. నెల్లూరుపాలెం వద్ద ఏర్పాటు చేసిన దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి మున్సిపల్ నిధులు ఏమైనా ఖర్చు చేశారా వాటి వివరాలు తెలపాలని కోరారు. అలాగే నూతనంగా ఏర్పడ్డ మున్సిపల్ బస్టాండ్ మున్సిపల్ నిధులు ఏమైనా ఖర్చు పెట్టారా వాటి వివరాలు తెలపాలని అడిగారు. ఈ వివరాలను సమాచారం తెలపాలని అడిగినప్పటికీ సమాచారం తెలపకపోవడంతో సమాచార హక్కు చట్టం కింద మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వివరాలు ఇవ్వకపోవడంతో కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసుకొని 70రోజుల కావస్తున్నా సమాచారం ఇవ్వకపోవడంతో, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. తాను అడిగే సమాచారం ఇచ్చేవరకూ ఇక్కడి నుండి కదిలే ప్రసక్తే లేదని భీష్మించుకుని కూర్చున్నారు. దాంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ సురా భాస్కర్ రెడ్డితో సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన కమిషనర్ తాను ఇటీవల కొత్తగా వచ్చానని, త్వరలో కావాల్సిన సమాచారం ఇస్తానని హామీనివ్వడంతో సురా భాస్కర్ నిరసన విరమించుకున్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నేలపై పడుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

జెవివి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కావలి : ఫిబ్రవరి 28న జరిగే 'సైన్స్ దినోత్సవం సందర్భంగా' సోమవారం జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ.రవికుమార్ వ్యాసరచన పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తరతరాల నుండి సమాజ ప్రగతికి శాస్త్రవిజ్ఞానం ఎంత ఉపయోగపడుతుందో.. రేపటి పౌరులైన నేటి విద్యార్థులకు తెలియజేయాలని, ఉత్తమ పౌరసమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో జనవిజ్ఞానవేదిక సైన్స్ దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 1 గంటలకు నుండి కావలి విశ్వోదయ బాలుర పాఠశాల ప్రాంగణంలో "వైజ్ఞానిక బస్సుయాత్ర" వస్తుందని తెలిపారు. కళ్ళజోడు శాస్త్రీయ రూపాలు, నృత్యాలు, నాటికల ద్వారా ప్రజలలో శాస్త్రీయ దృక్పథం అలవడేలా సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలందరూ "ఈ సైన్స్‌జాతా"లో పాల్గొనాలని జెవివి ఆహ్వానిస్తుందన్నారు. ఉపాధ్యక్షులు సి.శారద మాట్లాడుతూ సోమవారం జరిగిన వ్యాసరచన పోటీలో 20 పాఠశాల నుండి దాదాపు 100మంది 6, 7 తరగతుల జూనియర్లు, 8, 9, 10 తరగతుల నుండి సీనియర్లు పాల్గొన్నారన్నారు. జూనియర్లకు "శాస్త్రవిజ్ఞానం – మానవ ఆరోగ్యం" (సీనియర్లకు "శాస్త్రవిజ్ఞానం – సమాజం" అనే అంశాలపై వ్యాసాలు రాశారన్నారు. జెవివి ఉపాధ్యక్షులు సి.శర్మయ్య, కోశాధికారి టి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి.హరనాథ్, కార్యవర్గ సభ్యులు జనా వ్యాసరచన పోటీ నిర్వహణలో బాధ్యతవహించారు. 13, -14, తేదీల్లో వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఉదయం 9.30కు ఖచ్చితంగా ప్రారంభమవుతాయని ఉత్సాహంగా విద్యార్థులను ప్రోత్సహించి పంపాలని కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్ కోరారు. పాఠశాలలన్నింటికీ పోటీల వివరాలను పంపించామని తెలిపారు. ఆ వివరాల ప్రకారం, సందేశాత్మక పాటల పోటీ, సందేశాత్మక నృత్యాలపోటీ, 21వ తేదీ సైన్స్ ప్రదర్శనలకు విరివిగా విద్యార్థులు పాల్గొని శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని బాధ్యులు కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కావలి: కావలి పట్టణంలో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైజర్స్ కమ్యూనిటీ అసోసియేషన్ వారి సహకారంతో సోమవారం స్థానిక కుసుగోమ్మపేటలో 8వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు విద్యా ఉపకరణాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, షార్ప్‌నర్, ఎరేజర్స్, స్కేల్స్ పిల్లలకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్.ఎమ్. సుజాత మాట్లాడుతూ పేద విద్యార్థులకు మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వారిని ఉత్తేజపరుస్తూ.. ఉత్సాహపరుస్తూ నూతన పరీక్షా సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి మాట్లాడుతూ అమెరికాకు చెందిన "రైజర్స్ కమ్యూనిటీ అసోసియేషన్" సహకారంతో పేదవిద్యార్థులకు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రామయ్య, లక్ష్మి పావని, ట్రస్ట్ సభ్యులు ఆహారి వద్యాతి, టి.లక్ష్మి, లక్ష్మి నిత్య, సాయి, నిఖిల్, తదితరులున్నారు.

'కాకర్ల' ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : కాకర్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 263వ రోజు సోమవారం "ఎన్‌టిఆర్ సంజీవని ఆరోగ్యరథం" సేవలు మండలంలోని గణేశ్వరపురం గ్రామ రామాలయం వద్ద ఆరోగ్య సమస్యలున్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాక్టరుకు వివిధ ఆరోగ్య సమస్యలతో సంప్రదించిన 124మంది గ్రామస్తులందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 292వ రోజు అంబ్యులెన్స్ ద్వారా 630మంది తమ ఆకలిని తీర్చుకున్నారు. కాకర్ల సురేష్ చేస్తున్న నియోజకవర్గంలోని పేదప్రజల కోసం ఏర్పాటు చేసిన సంజీవని ఆరోగ్య రథం ద్వారా ఉచిత వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ, "అన్న క్యాంటీన్ ద్వారా భోజనం, ఉచిత వృత్తి విద్య శిక్షణలో భాగంగా టైలరింగ్, బ్యూటీషియన్, కార్ డ్రైవింగ్ కోర్సులు, నిరుపేదలకు పెళ్లి కానుక, నిరుపేద దిన వ్యాపారులకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థులు సంతోషంగా మధ్యాహ్న భోజనం చేసే విధంగా రుచి శుచికరమైన నాణ్యవంతమైన భోజనం తయారు చేయాలని ఎంఇఒ-1 షేక్.మస్తాన్ వలీ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వెంకట్రావుపల్లి భోజనం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్య నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల రికార్డులు, మనబడి నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే సామర్థ్యాలు మెరుగుపడే విధంగా ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వారి సామర్థ్యాలు మెరుగుపరిచే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే హాజరు శాతం చాలా తక్కువగా ఉందని ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఓటరు జాబితాలో తప్పులను సరి చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన జనవరి 22వ తేదీ ఓటర్ లిస్టు తుది జాబితాలో తప్పులు తడకలు ఉన్నాయని వాటిని సవరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, నాయకులు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో డిటి సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ తుది జాబితాలో నుండి తొలగించలేదని, ఒకే డోర్ నెంబర్‌లో అధికంగా ఓట్లు కలిగి ఉన్నాయని, వర్గనెంబర్ షిఫ్టు అయిన చాలా ఓట్లను తొలగించలేదని తెలిపారు. ఒకే కుటుంబంలో ఓట్లు వివిధవార్డులలో ఉన్నాయని, వాటిని కూడా సవరించలేదని తెలిపారు. ఓటర్ లిస్టులో ఫోటోలు మసకగా ఉండి కనిపించడం లేదన్నారు. తక్షణమే ఓటర్ జాబితాలోని తప్పులను సరిదిద్దాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. మాజీ కౌన్సిలర్ షేక్ జాఫర్ బాషా, మాజీ తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరు తిరుపతి నాయుడు, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు సిహెచ్ నరేష్, వడ్డెర సంఘం సాధికార సమితి అధ్యక్షుడు పల్ల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపును నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డిసిఎంఎస్ చైర్మన్ గౌ‌ఢపల్లి విజయ కుమార్, డిసిఎంఎస్ చైర్మన్ వీర చలపతిరావు, మండల కన్వీనర్ వద్ద రవిచంద్ర, జొన్నవాడ చైర్మన్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, పట్టణ కన్వీనర్ మల్లారెడ్డి, చైర్‌పర్సన్ సుప్రజా మురళి, యలరెడ్డి గోవర్ధన్ రెడ్డి, అల్లాభక్షు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'సంకల్పయాత్ర' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-సీతారామపురం : ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి విజయసంకల్ప యాత్రను జయప్రదం చేయాలని మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి ఆల్లూరు రాజులు పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లి, సింగారెడ్డి పల్లి, బుధవారం రోజున జాజులపల్లి, పబ్బులేటిపల్లి పంచాయతీలలో యాత్ర జరుగుతుందన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కావలి : జమాతే ఇస్లామీ హింద్ కావలి శాఖ ఆధ్వర్యంలో "మత్తు పదార్థాలు నిర్మూలిద్దాం – ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం" అనే రాష్ట్రస్థాయి ఉద్యమంలో భాగంగా సోమవారం కావలి శ్రీ సాయి విద్యానికేతన్, వపన్ స్కూల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీ కార్యక్రమం నిర్వహించారు. అందులో 40మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జమాతే ఇస్లామీ హింద్, కావలి బాధ్యులు మహబూబ్ బాషా తెలిపారు.

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని సిహెచ్ అనంతలక్ష్మి

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందని, పుస్తకాలు మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ఆభరణాలు అని ప్రధానోపాధ్యాయిని సిహెచ్ అనంతలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో సోమవారం గ్రంథాలయానికి ఆమంచర్ల నటరాజన్ జ్ఞాపకార్థం వారి కుమార్తె సరళదేవి 300 పుస్తకాలు బహూకరించారు. నటరాజన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని నటరాజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నటరాజన్ విద్యావేత్త, విద్యార్థుల శ్రేయస్సు కోసం పరితపించేవారని, మున్సిపల్ కమిషనర్‌గా వివిధ ప్రాంతాలలో అంకిత భావంతో పనిచేశారని ఆయన పుట్టినరోజున విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. నటరాజన్ కుటుంబ సభ్యులు వారి ఆశయాలను కొనసాగించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లికార్జున, సీనియర్ ఉపాధ్యాయులు బి సి పెంచలయ్య, తెలుగు పండితులు డాక్టర్ ఎం.ప్రసాద్, మధుసూదన శాస్త్రి, తదితరులున్నారు.

ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం..

ప్రజాశక్తి-ఉదయగిరి

స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో ఆహార తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని కళాశాల డీన్ డాక్టర్ టి.గోపికృష్ణ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఆయన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల హాస్టల్లో బాలురకు బాలికలకు ఒకే వంటగదిలో భోజనాన్ని తయారు చేస్తున్నామని తెలిపారు. గతంలో కొంతమంది విద్యార్థినులు బయటి ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురైంది వాస్తవమేనన్నారు. ఇంజనీర్ కళాశాలను వ్యవసాయ కళాశాలగా మార్చిన వెంటనే మూడు ఆరో ప్లాంట్లుతో స్వచ్ఛమైన మంచినీటి వసతి కల్పించామన్నారు. కొందరు కళాశాలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వాటిని విద్యార్థి తల్లిదండ్రులు నమ్మవద్దని ముఖ్యంగా ప్రజలను కోరారు.


మాట్లాడుతున్న కళాశాల డీన్ డాక్టర్ గోపికృష్ణ

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం

ప్రజాశక్తి-జలదంకి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా.. ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జమ్మలపాలెం గ్రామంలో సర్పంచ్ బుర్రి శ్రీవేణి, సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మేకపాటి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్ఎగా అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్టీ కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిగా నియోజకవర్గ స్థాయిలో జమ్మలపాలెం గ్రామంలోనే ప్రచార యాత్ర మొదలైందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పరిశీలకులు కొడవలూరు ధనుంజయ రెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, దుత్తలూరు జెఎస్ఆర్ ఫౌండేషన్ జయసింహారెడ్డి, జెడ్‌పిటిసి శివలీలమ్మ, సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్మోహన్ రెడ్డి, జిల్లా ప్రచార ప్రధాన కార్యదర్శి అంకెనపల్లి నరసింహారెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ జనరల్ సెక్రటరీ దామెర్ల దేవదాసు, జిల్లా రైతు విభాగ జనరల్ సెక్రటరీ రావి ప్రసాద్‌నాయుడు, కలిగిరి జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి రెడ్డి, వింజమూరు జెడ్‌పిటిసి గణపం బాలకృష్ణారెడ్డి, కన్వీనర్ కలిగిరి కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్‌లు తమ్మినేని సతీష్ బాబు, బొడిమల్ల కృష్ణారెడ్డి, నాయకులు గుమ్మిడి రమేష్, చేజర్ల హరిబాబురెడ్డి, పసుపులేటి ప్రసాద్, కాకాని మహదేవయ్య, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సర్టిఫికెట్లు మంజూరు చేయించండి సారూ..!

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలంలోని వెల్లంటి గ్రామంలో ఈ మధ్యకాలంలో జరిగిన రీ సర్వేలో రైతులకు అందజేసిన పట్టాలలో తప్పులుగా ఉన్న పేర్లు, సర్వే నెంబర్లు మార్పునకు అవసరమైన సర్టిఫికెట్లను ఉన్నతాధికారులు మంజూరు చేయించాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో తమ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా పట్టాల పంపిణీ జరిగి మూడు నెలలైందన్నారు. ఆ పట్టాలకు సంబంధించిన చాలామంది రైతుల పేర్లు, సర్వే నెంబర్‌లు తప్పుగా నమోదయ్యాయని తెలిపారు. ఆ మేరకు పొలాల విస్తీర్ణంలో తప్పిదాలను సవరించేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు సరిగా మంజూరు చేయక పోవడం, రేషన్ కార్డులు విషయంలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుందన్నారు. గత మూడు నెలల నుంచి వెల్లంటి గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్‌ఒ)కి ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. తహశీల్దారుకు సైతం తమ సమస్యలను తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తమ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలనే ఉద్దేశంతోనే స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు విన్నవించుకున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు జనపాల వెంకట రమణా రెడ్డి, పల్లవరపు శ్రీనివాసులు, గుడి.రాజయ్య, తేరు.హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతుసంఘం మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి-కోవూరు

పెద్దపెద్ద కార్పొరేట్ వైద్యశాలలో చేయాల్సిన ఆపరేషన్‌ను కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ కార్డుతో ఉచితంగా చేసి సంబంధిత వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ శభాష్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కోవూరుకు చెందిన 31 సంవత్సరాల వివాహిత 3 సంవత్సరాల క్రితం ట్యుబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. ఈ నేపథ్యంలో ఆ వివాహితకు ఇన్సిసినాల్ హెర్నియో సోకింది. వాస్తవంగా ఈ ఆపరేషన్‌ను కేవలం కార్పొరేట్ వైద్యశాలలో మాత్రమే చేయడం జరుగుతుంది. అటువంటి అరుదైన ఆపరేషన్‌ను ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఈ హెర్నియో ఆపరేషన్ చేసి సహచర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మన్ననలు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం కోవూరు ఆస్పత్రిలో అన్ని రంగాలకు సంబంధించి మంచి ప్రావీణ్యం కలిగిన వైద్యులు ఉన్నారని, ఇప్పటికే జిల్లాలోని అన్ని సామాజిక కేంద్రాల్లో కల్లా సేవల్లో ప్రథమ స్థానంలో ఉండడమే కాకుండా రాష్ట్రస్థాయిలో కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం 5వ స్థానంలో కొనసాగుతుందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలోని సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి హెర్నియో ఆపరేషన్లు అరుదుగా వస్తాయని, కార్పొరేట్ వైద్యశాలలో ఖర్చుతో కూడిన ఆపరేషన్ అని తమ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్‌ను దిగ్విజయంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఆపరేషన్ చేయించుకున్న మహిళ కుటుంబ సభ్యులు డాక్టరుకు ప్రత్యేకంగా చేతులు జోడించి అభినందించారు.

సుజనకు ఎంఎల్ఎ అభినందనలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

బుచ్చిరెడ్డి పాలెం నగర పంచాయతీలోని జొన్నవాడ దేవస్థానం నూతన కమిటీ ఏర్పడినందున జొన్నవాడ బోర్డు డైరెక్టరుగా గాజుల సుజన నియమితులైనందున ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ పదవి దక్కినందుకు ఎంఎల్ఎ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని మమ్ము చేయకుండా పదవీ బాధ్యతలు చేపట్టి మంచిపేరు తెచ్చిపెడతానన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-కావలి

కావలి మండలం అన్నగారి పాలెం పంచాయతీ పూలదరువు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు, కావలి పట్టణ టిడిపి కార్యాలయంలో సోమవారం వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కావలి టిడిపి మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కావలి టిడిపి ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ మాజీ వార్డుమెంబర్ కాకి పుష్పమ్మ, గ్రామపెద్ద అరగల సీనయ్య, కాకి నాగేశ్వరరావు, అరగల లక్ష్మీనారాయణ, గల్లా రమణమ్మ, అరగల ఆదిలక్ష్మమ్మ, కాకి శారదమ్మ, గల్లా జయశ్రీ, భారతి, దాసరి పేరమ్మ, నెల్లూరు మమత, విడవలూరు లలిత, బుక్కి తులసమ్మ, జి.రమణమ్మ, తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. కుటుంబాలకు కుటుంబాలు చంద్రబాబుని, తనను నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని క్రిష్ణారెడ్డి హామీనిచ్చారు. అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, నెల్లూరు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి పెనుబాపల వెంకటేశ్వర్లు, వాయిల తిరుపతి, కాటంగారి వెంకట్రావు, అరగల జాలయ్య, కాకి మురళి, అరగల సుధ, నెల్లూరు రాజేష్, అరగల రవి, అరగల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కావ్యక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కుటుంబాలు

సచివాలయంలో 8మంది సిబ్బంది ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని ప్రతి సచివాలయంలో 8 మంది సిబ్బంది ఉండాలని ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డుల సర్వేను ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీని త్వరితగతిన పూర్తి వాటితోపాటు ఈకెవైసి చేయించాలన్నారు. కులగణన సర్వే ఇప్పటి వరకు 92.84శాతం పూర్తి అయ్యిందన్నారు. కుల గణన సర్వే ఇవాళతో ముగియనున్నట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరమ్మ

మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి శైలజ

ఈ-కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-జలదంకి

ఈక్రాప్ నమోదు చేయించుకున్న ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ కెవైసి తప్పనిసరిగా చేయించు కోవాలని మండల వ్యవసాయ అధికారిని శైలజ తెలిపారు. ఈకెవైసి చేయించుకోవడంతోనే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. పండించిన పంటను ప్రభుత్వానికి అమ్ముకోవాలన్నా, సబ్సిడీలు రావాలన్నా ఈ కెవైసితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ చరణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తిమ్మారెడ్డిపల్లి వంతెన

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి సమీపంలో ఉన్న వంతెన అత్యంత ప్రమాదకరంగా మారిపోయింది. సుమారు 20యేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, వంతెన మధ్య భాగంలో రంధ్రాలు కూడా ఏర్పడ్డాయి. ఎంతోమంది ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ఈ రంధ్రాలలో చిక్కుకొని గాయాల పాలైన సంఘటనలు కూడా కోకొల్లలుగా ఉన్నాయి. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడం తూ.తూ. మంత్రంగా కొంత సిమెంటు కలిపి రంధ్రాలు పూడ్చటం వాహనదారులకు శాపంగా మారుతుంది. ఇదే తరహాలో తెండుపాడు దగ్గర ఒక పాత బ్రిడ్జి తొలగించకుండా రహదారి పూర్తి చేయడంతో అమాంతం ఒక్కసారిగా బ్రిడ్జి సైజు తగ్గిపోవడం ప్రమాదాలకు కారణం అవుతుంది. జాతీయ రహదారి నిర్మించే క్రమంలో ఈ రెండు బ్రిడ్జిలను మినహాయించి బిల్లు తీసుకున్నారా లేక నూతన బ్రిడ్జిలు నిర్మించినట్టు చూపించారా అనే సందేహం స్థానికులకు వ్యక్తమవుతుంది. శిథిలమైపోయిన ఈ తిమ్మారెడ్డిపల్లి వంతెన పైనుంచి నిత్యం కొన్ని వేల వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ వంతెనను నూతన వంతెన ఎందుకు నిర్వహించలేదో అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. భారీ వాహనాలు వస్తే కూలేందుకు సైతం సిద్ధంగా ఉన్న ఈ వంతెనతో ఆందోళన కలుగుతుంది. రహదారిపై కానీ వంతెనలపై కానీ చిన్నగుంట ఉన్నప్పటికీ దాని మూల్యం ఒక ప్రాణం ఖరీదుగా మారిపోతుంది. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ కానీ లేక రోడ్లు భవనాల శాఖ అధికారులు కానీ ఇవేవీ కాకుంటే స్థానిక పంచాయతీ పరిధిలోని అధికారులైనా సరే కాలం చెల్లిన ఈ వంతెనకు స్వల్ప మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని వరికుంటపాడు మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన తిమ్మారెడ్డిపల్లి వంతెన

Before The III Addl. Motor Accidents Claims Tribunal : Nellore
I.A.No. 246 / 2022
M.V.O.P.No. 224 / 2017

1. Darapaneni Malyadri and 4 others - Petitioners / Claimants
Versus
1. **The Andhra Pradesh State Road Transport Corporation,** Rep.by its Managing Director, Musheera Bad, Hyderabad.
2. **N.Murali Krishna** - Respondents/Respondents

Notice to 2nd Respondent

N.Murali Krishna, S/o **Venkateswarlu,** R/o D.No.6/115, Sivaji Nagar, Nellore Rural, Nellore District.

పై నెంబరున పిటిషనర్స్/క్లయిమెంట్స్, డిస్మిసల్ ఆర్డర్‌ని సెటసైడ్ చేయమని పిటిషన్ వేయడంలో ఆలస్యమైనందున, ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో సెక్షన్5 ఆఫ్ లిమిటేషన్ యాక్ట్ ప్రకారం మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే06-03-2024 ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సిహెచ్.శ్రీధర్ రావు, బి.కాం., ఎల్.ఎల్.బి.,
పిటిషనర్స్ / క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

Before The III Addl. Motor Accidents Claims Tribunal : Nellore
I.A.No. 247 / 2022
M.V.O.P.No. 224 / 2017

1. Darapaneni Malyadri and 4 others - Petitioners / Claimants
Versus
1. **The Andhra Pradesh State Road Transport Corporation,** Rep.by its Managing Director, Musheera Bad, Hyderabad.
2. **N.Murali Krishna** - Respondents/Respondents

Notice to 2nd Respondent

N.Murali Krishna, S/o **Venkateswarlu,** R/o D.No.6/115, Sivaji Nagar, Nellore Rural, Nellore District.

పై నెంబరున పిటిషనర్స్/క్లయిమెంట్స్, డిస్మిసల్ ఆర్డర్‌ని సెటసైడ్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఆర్డర్ 9, రూల్9 ఆఫ్ సి.పి.సి. ప్రకారం మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే06-03-2024** దికి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసి నది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సిహెచ్.శ్రీధర్ రావు, బి.కాం., ఎల్.ఎల్.బి.,
పిటిషనర్స్ / క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.